# స్థలమహత్యం

-భమిడిపాటి సోమయాజి

సాయంకాలం ఆరుగంటలవుతోంది. వేసవి వేడి తన ప్రతాపాన్ని పాడితప్పకుండా ప్రదర్శిస్తోంది. సాయంకాలం కూడా మధ్యాహ్నం లాగే వుంటోంది! ప్రతాప్ యింటికి వచ్చాడు. ఇంకా పూర్తిగా యింట్లోకి రాకుండానే మొదలుపెట్టింది అతని భార్య, సత్యభామ.

"ఏమండోయ్! మా సుబ్బి పెళ్ళి యీనెల యిరవై అయిదో తారీఖున.. వైజాగ్‌లో!"

"చాలా సంతోషం! ముందు మంచినీళ్ళు తగలెయి తర్వాత యీ పెళ్ళివిషయం చూద్దాం!" అన్నాడు ప్రతాప్.

> ## ఉగాది
>
> గండు కోయిల గళం విప్పెను
> నిండు మనసుకు పండుగే
> సర్వధారి రాక తోడనె
> లోకమంతా పులకించే
> వేపపూవు చేదు వెనుకే
> సత్యమెప్పుడు తొండిచూచు
> నిజము, నిత్యము చేదు కాదా!
> కఠినమైనది సత్యమిలలో
> క్రొత్తమామిడికాయలోన
> వగరు తత్త్వము ఇమిడిపోయె
> పులుపు జిహ్వకు సోకినంతనె
> క్రొత్త భావము లెన్నో మదిలో
> చేదు, పులుపులు ఒక్కటవగ
> గుడము దానికి వసంతపాడగ
> నిండు మనసులతోటి వారికి
> సందడే ఇక ఈ ఉగాది వేళ
> 'సర్వజిత్తు' దొరలిపోగా
> మమతలెన్నో పంచిపోయె
> సమత పండించె మనలో
> 'సర్వధారి'ని స్వాగతించె
> కలగాలి శుభాలెన్నో మీకు
> వెలుగులే ఇక జగతిలోన
> తమస్సంతా తొలగిపోవ
> మమతలెన్నో పంచు నీవు.
>
> -డా॥ కె. సుందరలక్ష్మి

మంచినీళ్ళు తాగి ఆ శుభలేఖ చూసాడు. "పెళ్ళి చావుల మదుం దగ్గరన్న మాట! నేనటువంటి చోటికి రాను! నువ్వు పిల్లలూ వెళ్ళండి."

"అయ్యో అదేమిటండీ! వాళ్ళు చచ్చి చచ్చి దానికి సంబంధం కుదిర్చి, పెళ్ళి చేస్తుంటే మీరు రానంటారేమిటి? మా బాబయ్య ఫోన్లో ఎలాగూ చెపుతాడు. సరదాగా వెడదాం" అంది భామ.

"సర్లే చూద్దాం! ముందు కొంచెం నిమ్మరసం పట్రా"

❖ ❖ ❖

అప్పుడే యీరోజు పదవ తారీఖు. పిల్లలకి కొత్త బట్టలు కొనండి అంది భామ.

అవ్వన్నీ నేను చెయ్యలేను డబ్బిస్తాను ఒకే రకం బట్టలు కొనకు పిల్లల్ని ఆ పెళ్ళిలో చూస్తే బ్యాండ్ మేళం అనుకుంటారు.

"బ్యాండ్ మేళం అంటే మొత్తం ఎంతమందో కూడా తెలిసి చావదు మీకు. మన ముగ్గురు పిల్లలూ ఒక బ్యాండ్ మేళం అవదు" అంది భామ.

"అవన్నీ అనవసరం నేను చెప్పినట్లు చెయి"

వైజాగ్ భామా సమేతంగా వెళ్ళాడు. రైలు దిగగానే పిల్లలు కుదురుగా ఒకచోట నిలబడలేదు. పాపం ఈ మధ్య రైలు ప్రయాణాలు చెయ్యలేదు. రైలు ప్రయాణాలు చాలా రంజుగా వుంటాయి మరి. ఆ ముగ్గురిలో ఒక వెధవ తప్పిపోయాడు. మైక్‌లో చెప్పారు. ఆ రాలు గాయి దొరికాడు. "అందుకేనండీ ఒకే రకం బట్టలు కుట్టిస్తే, మన వెధవల్ని సులువుగా గుర్తుపట్టొచ్చు" అంది భామ.

"బాబూ! చావుల మదుం దగ్గరికి ఎంత తీసుకుంటావు?"

ఆటోవాడు ఎనభై అడిగాడు. మొత్తం మీద నలభైకి ఒప్పించాడు ప్రతాప్.

వీళ్ళు వెళ్ళిన గంటదాకా ఎవ్వరూ వీళ్ళని పట్టించుకోలేదు. ప్రతాప్‌కి మండింది. "శుభలేఖలు వేస్తారు! తప్పక రమ్మని ఫోన్స్ చేస్తారు. తీరా వస్తే వచ్చావా చచ్చావా అనేవారుండరు" అన్నాడు గట్టిగా.

"తప్పు బాబూ! పెళ్ళి హాల్లో చావు గురించి మాట్లాడకూడదు!" అన్నాడు ఒక పెద్దాయన.

"మీకేమండీ! మీరు ఏ అనకాపల్లి నుంచో వచ్చుంటారు. మేం, హైదరాబాద్ నుంచి చచ్చి వచ్చి వచ్చాం!" అన్నాడు ప్రతాప్.

ఇంతలో లోపల్నుంచి వచ్చిన పెళ్ళికూతురు తల్లి "అయ్యో ఎంతసేపయింది వచ్చి? నేను లోపల పనుల్లో పడి చస్తున్నాను. కాఫీలు తాగి, స్నానాలు చెయ్యండి" అంది.

పెళ్ళింట్లో చావు గురించి మాట్లాడకూడదని మళ్ళీ చెప్పాడు ఆ పెద్దాయన.

"ఆ! ఊరికే చస్తున్నాం అంటే తప్పుకాని నిజంగా చచ్చేటప్పుడు చస్తున్నామంటే తప్పులేదు!" అంది పెళ్ళి కూతురు తల్లి.

"ఇక లాభంలేదు! మీ చావు మీరు చావండి!" అనుకున్నాడు ఆ పెద్దాయన.

ఇంతలో ఒకావిడ వచ్చి "ఉప్మాలో జీడిపప్పు రాలేదని పెళ్ళికొడుకు మేనమామ మండిపడిపోతున్నాడు" అని పెళ్ళికూతురి తండ్రితో చెప్పింది.

"చావమను వెధవని! ఇంట్లో శనగపప్పు కూడా ఎక్కువేసుకోరు వెధవలు! పెళ్ళిళ్ళలో జీడిపప్పు కోసం ఏడుపు!"

ముత్యంగా మూడోసారి చెప్పి మానేద్దామని "పెళ్ళింట్లో చావు గురించి మాట్లాడకూడదు" అన్నాడు ఆ పెద్దాయన.

"మరి వాడు జీడిపప్పు కోసం చావొచ్చా!" అన్నాడు పెళ్ళికూతురు తండ్రి.

"ఇక వదిలేయండి" అంది ఆయన భార్య.

❖ ❖ ❖

సత్యభామ తన ముగ్గురి మొగపిల్లలకీ మొన్న కొన్న కొత్త బట్టలు వేసి మురిసిపోతోంది. "మట్టిలో ఆడకండి పెళ్ళయ్యే వరకూ యివే బట్టలు సరేనా!" అని తను స్నానానికి వెళ్ళింది.

ఇంతలో వాడి చొక్కా బాగుందని వీడు, వీడి చొక్కా బాగుందని వాడూ చొక్కాలు చింపేసుకున్నారు. ఎవ్వరో వచ్చి చెప్పారు ప్రతాప్‌తో "మీ పిల్లలు కొట్టుకు చస్తున్నారు!" అని.

ప్రతాప్ వచ్చి చూసాడు. మొన్ననే కొన్న కొత్త బట్టలు చిరిగిపోవడం సహించలేకపోయాడు. ఒక్క అరుపు అరిచాడు "భామా! ఎక్కడ చచ్చావు" అని.

"నేనెక్కడ చస్తే మీకెందుకు! ఎవరి చావు వారు చావండి!" అని కోపంగా వచ్చింది యింకొక భామ.

మిమ్మల్ని కాదండి బాబూ అసలు మీ పేరు భామని నాకు తెలీనే తెలీదు అన్నాడు ప్రతాప్.

స్నానం ముగించుకొచ్చిన సత్యభామ పిల్లల చిరిగిన చొక్కాలు చూసి చావకొట్టింది వాళ్ళని.

❖ ❖ ❖

చావు అనకూడదు అని చెప్పిన పెద్దాయన పెళ్ళి కొడుకు ఎలా వున్నాడో చూద్దామని మగ పెళ్ళివారి విడిదికి వెళ్ళాడు. పెళ్ళికొడుకు తండ్రి ఆయన మీద విరుచుకు పడ్డాడు.

"ప్రతీవాళ్ళు వస్తూండడం వెళుతూండడం! పొద్దుట్నుంచీ నల్గురికి చెప్పాను. మా విడిదిలో రెండు ఫాన్లు తిరిగి చావటంలేదు. ఇవి బాగు చేయించలేదు. అసలే వేసంకాలం ఛస్తున్నాం. మీరు పెద్ద మనుషుల్లా వున్నారు. తర్వాత పెళ్ళికొడుకుని చూద్దురుగాని! ముందు యీ ఫాన్లు బాగుచేయించండి"

"పొద్దుట్నుంచి పెళ్ళింట్లో చావు గురించి మాట్లాడకూడదని, ఆడపెళ్ళివారికి చెప్పి విఫలమయ్యాం! నా అదృష్టాన్ని యిక్కడ పరీక్షించుకుంటాను" అని అదే విషయం ఆ పెళ్ళి కొడుకు తండ్రికి చెప్పాడు.

"సర్లేవయ్యా! మాకూ తెలుసు. అసలు మా చావు మీరు ఛస్తే మీకు తెలుస్తుంది. వెళ్ళి నే చెప్పిన పని చెయ్యండి!" అని మండిపడిపోయాడు పెళ్ళికొడుకు తండ్రి.

"ఒకరి చావు ఒకరు చావరు. ఎవరి చావు వాళ్ళే చావాలి. అది మర్యాద!" అని చెపుదామనుకున్నాడు కాని యిది సమయం కాదు, పుస్తె ముడిపడిన తర్వాత చెపుదామని వెనక్కి వచ్చేసాడు ఆ పెద్దాయన.

సత్యభామ పట్టుచీర కట్టుకుని, తన నెక్లెస్ సర్దుకుంటూ వచ్చి, "అందరూ నన్ను చూసి ఛస్తున్నారు!" అంది.

"సహజమే! మన పెళ్ళైనప్పట్నుంచీ నిన్ను చూడలేక నేనూ ఛస్తున్నాను! ఆశ్చర్యమేముంది?" అన్నాడు ప్రతాప్.

"అదే మీతో వచ్చిన చావు! సమయం, సందర్భం లేకుండా జోకులు వేసి చంపుతారు" అంది భామ.

"అయితే యింకా యిది మానలేదన్నమాట!" అనుకున్నాడు ఆ పెద్దాయన.

పెళ్ళయిపోయింది! ఈ చావు పరంపర గురించి పురోహితుడితో చెప్పాడు ఆ పెద్దాయన.

పురోహితుడు చెప్పాడు "మీరేం పట్టించుకోకుండి! స్థలమహత్యం! పెళ్ళి చావుల మదుం దగ్గర చేస్తే, అంతే మరి!" ■